సాక్షి
గుంటూరు

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



మల్లేశ్వరునికి రూ.61.17 లక్షలు

పెదకాకాని: మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలు శుక్రవారం లెక్కించారు. ఆదాయం రూ.61,17,251 సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



అందుబాటులోకి 'డిజియాత్ర'

గన్నవరం: విమాన ప్రయాణికుల బోర్డింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు రూపొందించిన డిజియాత్ర సేవలను శుక్రవారం ఎయిర్ పోర్టులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు.

కరోనా - జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6:26	4:46
నరసరావుపేట	6:28	4:43
బాపట్ల	6:26	4:46

టీడీపీ బరితెగింపు

- కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై దాడి
- రచ్చకు టీడీపీ సభ్యుల కుట్ర
- గంట ముందు నుంచే సంకేతాలు
- కెమెరాలతో అనుకూల మీడియా హల్‌చల్
- వెంటనే సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల దాడి అంటూ పోస్టులు
- దాడిని తిప్పికొట్టే క్రమంలో పరస్పరం ముష్టిఘాతాలు

'టీడీపీ కౌన్సిలర్లు బరితెగించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై దాడికి దిగారు. ఇష్టారాజ్యంగా చొక్కాలు చింపేశారు. సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే లక్ష్యంగా చేసుకున్నారు. సమావేశం ప్రారంభం నుంచే అధికార పక్షాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. వార్డుల్లో పనులపై ఆరోపణలు గుప్పించారు. పథకం ప్రకారమే సమావేశంలో రచ్చకు దిగారు'.. ఇదీ తెనాలి మున్సిపల్ కౌన్సిల్ తీరు.



వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ రహమత్ బేగ్ చొక్కా పట్టుకుని దాడి చేస్తున్న టీడీపీ కౌన్సిలర్

తెనాలి అర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. అజెండాలోని 11వ అంశంపై టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్ మాట్లాడుతూ సింగిల్ టెండరు ఉన్న అంశాలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఆవుల కోటయ్య మాట్లాడుతూ తన వార్డులో జరిగే అభివృద్ధి పనులపై మీరు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు. 'మీకు అంత బాధగా ఉంటే మీరే టెండర్లలో పాల్గొనవచ్చు అని సూచించారు. ఇంతలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మొఘల్ రహమత్ బేగ్ స్పందిస్తూ అభివృద్ధి పనులను టీడీపీ సభ్యులు అడ్డుకోవాలని చూడటం మంచి పద్ధతి కాదంటూ హితవు పలికారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్ ప్రతిస్పందిస్తూ, ఏకవచనంతో 'నువ్వు చెప్పేదేమిటి... అంటూ రహమత్ బేగ్‌ను రెచ్చగొట్టాడు. దీంతో ఆగ్రహంతో రహమత్ ముందుకు రాగా, టీడీపీ కౌన్సిలర్లు భౌతిక దాడికి దిగారు. అతడిపై దాడి చేశారు. ఆ వెంటనే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లలో కొందరు టీడీపీ కౌన్సిలర్లను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట, పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఈ ఘర్షణలో యుగంధర్, మొఘల్ రహమత్ చొక్కాలు చిరిగిపోయాయి. ఇది సరైన విధానం కాదంటూ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఇరువర్గాల వారిని శాంతింపజేశారు.

ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ..

అజెండాలోని రెండో అంశం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు కల్పించుకుని కౌన్సిల్ సమావేశాలను లోకల్ చానల్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయించాలని సూచించారు. కౌన్సిల్‌లో తాము ప్రజాసమస్యలను ప్రస్తావించటం లేదంటూ వార్డు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ టీడీపీ కౌన్సిలర్లు ఇదే అంశంపై చైర్‌పర్సన్‌కు లిఖితపూర్వక వినతిని సమర్పించారు. ఇది జరుగుతుండగా చైర్‌పర్సన్ సమావేశాన్ని



కౌన్సిలర్ రహమత్‌ను చుట్టుముట్టిన టీడీపీ కౌన్సిలర్లు

పోడియం ఎదుట ధర్నా

కొద్దిసేపు వాయిదా వేసి వెళ్లిపోయారు. టీడీపీ కౌన్సిలర్లు పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. కొద్దిసేపటి తర్వాత చైర్‌పర్సన్ సమావేశాన్ని పునః ప్రారంభించగానే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య.. అజెండాలోని అన్ని అంశాలు, టేబుల్ అజెండాను ఆమోదించాలని ప్రతిపాదించారు. చైర్‌పర్సన్ ఆమోదించినట్లు ప్రకటించారు.

వ్యూహాత్మకంగా దాడి

కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి గంట ముందు నుంచే టీడీపీ కౌన్సిలర్లు, వైఎస్సా ర్ సీపీ సభ్యులను రెచ్చగొట్టి ఘర్షణకు దిగుతారని ప్రచారం జరిగింది. పథకం ప్రకారం వ్యవహరించి రెచ్చగొట్టి ఘర్షణకు దారితీసేలా చూశారు. వారి అనుకూల మీడియా కూడా ముందుగానే కెమెరాలతో సిద్ధమై ఉన్నారు. ఘర్షణ చోటుచేసుకున్న వెంటనే రికార్డు చేసి సోషల్ మీడియాలో ఉంచారు. ఒక సామాజిక వర్గం కౌన్సిలర్‌పై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల దాడి అంటూ ఆ వర్గాన్ని రెచ్చగొట్టాలని చూశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, కౌన్సిలరు రహమత్ బేగ్‌పై జరిగిన దాడిని ఖండించారు.



టీడీపీ కౌన్సిలర్లు దాడి చేశారు..



తనపై టీడీపీ కౌన్సిలర్లు దేసు యుగంధర్, పసుపులేటి త్రిమూర్తి దాడి చేశారు. రంజాను మాసంలో ఉపవాసంతో ఉన్నా. తనను రెచ్చగొట్టి ఇలా చేశారు. పథకం ప్రకారమే దాడికి పాల్పడ్డారు.

–మొఘల్ రహమత్ బేగ్, బాధిత కౌన్సిలర్

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం...



మున్సిపల్ కౌన్సిల్‌లో దాడిని ఖండిస్తున్నా. దురదృష్టకరం. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– ఖాలేదా నసీమ్, మున్సిపల్ చైర్‌పర్సన్

కౌన్సిల్ ఘటనపై రెండు కేసులు నమోదు



సీఐకు ఫిర్యాదు చేస్తున్న రహమత్ బేగ్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు

తెనాలి రూరల్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్‌లో శుక్రవారం చోటుచేసుకున్న దాడి ఘటనపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. టీడీపీ సభ్యులు పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, అన్నం పిన్నారావు, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తాడిబోయిన బ్రహ్మం దాడికి పాల్పడ్డారని, అంతే కాక కౌన్సిల్ హాలులోకి కౌన్సిల్‌తో సంబంధం లేని టీడీపీ నాయకులు సుమారు 20 మంది దూసుకు వచ్చి తనతో పాటు వైఎస్సార్ సీపీ సభ్యులపై దాడికి పాల్పడ్డారని 33వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మొగల్ రహమత్ బేగ్, ఇస్మాయిల్, తోట రఘురాం దాడికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సభ్యుడు దేసు యుగంధర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ కౌన్సిలర్లు, నాయకులతో కలసి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించి ధర్నా చేశారు. కౌన్సిలర్లు ఇచ్చిన రెండు కేసులనూ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ఎస్.వెంకటరావు తెలిపారు. యుగంధర్‌పై దాడిని నిరసిస్తూ శనివారం పట్టణ బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ఆర్యవైశ్య సంఘ సభ్యులు ప్రకటించారు.

డెల్టాకు నీరు విడుదల

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 140 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 144 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 307, పశ్చిమ కెనాల్‌కు 47, కొమ్మమూరు కాల్వకు 773 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

పన్ను వసూళ్లలో రెండో స్థానంలో గుంటూరు

చివరి రోజు రూ.10.03 కోట్లు రాక



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పన్నులు వసూలు చేసి గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. శుక్రవారం ఒక్కరోజే రూ.20.55 కోట్లు వసూలు చేసి విశాఖపట్నం మొదటి స్థానంలో నిలవగా, రూ.10.03 కోట్లతో గుంటూరు నగరపాలక సంస్థ రెండో స్థానంలో నిలిచింది. గతేడాది ఇదే రోజున రూ.4.30 కోట్లు వసూలు చేయగా ప్రభుత్వం ఈసారి ఆస్తి పన్ను వసూలుపై వడ్డీ రాయితీ ఇవ్వడంతో శుక్రవారం ఒక్కరోజే రూ.10.03 కోట్లతో గతేడాది కంటే ఈసారి రెట్టింపు వసూలు చేశారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పన్ను వసూలుకు ప్రత్యేక కృషి చేసిన అధికారులకు, కార్యదర్శులకు, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 529.50 అడుగుల వద్ద ఉంది. ఇది 167.1730 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 3,144, ఎడమకాలువకు 7,518, ఎస్ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 12,982 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 12,982 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 806.40 అడుగుల వద్ద ఉంది. ఇది 32.2875 టీఎంసీలకు సమానం.


వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

గుంటూరుమెడికల్: మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ భాగ్యరత్నం, మల్టీ హెల్త్ సూపర్‌వైజర్ (ఎంపీహెచ్ఎస్) దాస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారన్నారు. ఆ సమయంలో సీనియర్ అసిస్టెంట్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదనే విషయం వెలుగులోకి వచ్చిందని వెల్లడించారు. సూపర్‌వైజర్ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమాధానాలు చెప్పకపోవడంతో వారివురికి కలెక్టర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. షోకాజ్ నోటీసులకు మూడురోజుల్లో ఇరువురు సమాధానం ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు.

మార్చిలో అధిక వర్షపాతం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో మార్చి నెలలో సాధారణ వర్షపాతానికి మించి మూడు రెట్ల అధిక వర్షపాతం నమోదైంది. మార్చి నెలలో 249.6 మిల్లీ మీటర్ల సాధారణ వర్షం కాగా 1021.0 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలోని 28 మండలాల్లో సగటున 8.9 మి.మీ పడాల్సి ఉండగా 36.5 మిల్లీమీటర్లు కురిసిందని వాతావరణ శాఖ విభాగం విడుదల చేసిన మేరకు నిర్ధారణవుతుంది. నాదెండ్ల మండలంలో సాధారణ వర్షం రెండు మి.మీ. కాగా అత్యధికంగా 82.4 మి.మీ పడింది. క్రోసూరు, పెదకూరపాడు, నూజెండ్ల మండలాల్లో సాధారణ వర్షం కంటే తక్కువగా వర్షం నమోదైంది.

పులిచింతల నీటి నిల్వ



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 3200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు.

సుందరయ్య కళా పురస్కారం దక్కడం నా అదృష్టం



సినీనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజకు సుందరయ్య పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

సినీ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

యడ్లపాడు: ఆదర్శ రాజకీయనేత పుచ్చలపల్లి సుందరయ్య పురస్కారం అందుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. స్థానిక సుందరయ్య జాతీయస్థాయి నాటికల పోటీల ప్రారంభోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. సుందరయ్య త్యాగం, పోరాటం, నిబద్ధతను అనుసరణీయమని పేర్కొన్నారు. ఖమ్మంజిల్లా క్యూర్ హాస్పిటల్ అధినేత పోపూరి రవిమారుతి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి నాయకులు నూతలపాటి కాళిదాసు ప్రసంగించిన వారిలో ఉన్నారు. అనంతరం సుందరయ్య కళా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ముందుగా సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని అతిథులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముత్తవరపు పద్మారావు, జరుగుల శంకరరావు, ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

ప్రియురాలే ప్రాణం తీసింది

- కొంత కాలంగా ఇద్దరు సహజీవనం
- గురువారం అర్ధరాత్రి ఘటన
- గుర్తు తెలియని వ్యక్తులు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- పోలీస్ విచారణలో దొరికిన వైనం



నిందితురాలు ఆమని



గద్దె రాము(ఫైల్)

తెనాలి రూరల్: సహజీవనం ఓ యువకుడి ప్రాణం తీసింది. ప్రియుడి గొంతు కోసి కిరాతకంగా హతమర్చడమే కాకుండ ఎవరో హత్య చేసి వెళ్లారంటూ పోలీసులకు నమ్మించేందుకు ప్రయత్నించింది. పోలీసులు కథనం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన తన్నీరు ఆమని ఎనిమిదేళ్ల క్రితం భర్త, ఇద్దరు పిల్లలతో కలసి తెనాలి వచ్చింది. మండలంలోని కఠెవరం పరిధిలో కాల్వ కట్టపై నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆమనికి పట్టణంలోని చెంచుపేటకు పెయింటర్ గద్దె రాము(29) పరిచయమయ్యాడు. పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న భర్త మూడేళ్ల క్రితం భార్య, పిల్లలను వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి రాముతో సహజీవనం చేస్తోంది. ఇటీవల మరో ఇద్దరితో చనువుగా ఉంటోందని రాము గ్రహించారు. గురువారం రాత్రి పూటుగా మద్యం తాగి వచ్చిన రాము ఆమెను దూషిస్తూ ఉన్నాడు. అర్ధరాత్రి దాటాక ఇంట్లోని చాకుతో అతడి గొంతు కోయడంతో మృతి చెందాడు.

గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని..

రామును ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని పోలీసులకు ఆమని సమాచారమిచ్చింది. ఇంటి బయట మద్యం తాగుతున్న రాముపై వారు కత్తితో దాడి చేసి వెళ్లగా, తలుపు తెరచుకుని ఇంటి లోపల పడిపోయి మృతి చెందాడని పోలీసులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. రూరల్ ఎస్ఐలు సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించారు. ఇంట్లో పెనుగులాట జరిగిన ఆనవాళ్లను గుర్తించిన పోలీసులు ఆమనిపై అనుమానంతో ఆమెను గట్టిగా ప్రశ్నించగా నేరం అంగీకరించింది. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని, ఇతరుల పాత్ర ఉందా అన్న విషయాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసుల తెలిపారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- సోమవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు పరీక్షలు
- జిల్లాలో హాజరు కానున్న 27,714 మంది విద్యార్థులు
- తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు
- హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం
- జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



విలేకర్ల సమావేశంలో డీఈఓ శైలజ, డీవైఈఓ సుధాకర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈఓ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 456 పాఠశాలల నుంచి హాజరు కానున్న 27,714 మంది విద్యార్థులకు 138 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు.

ఉదయం 9.30 గంటల వరకే అనుమతి

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులు కనీసం 8.30 కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 8.45 నుంచి 9.30 వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 9.30 తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు వీలుగా హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు.

బార్ కోడింగ్‌తో ఓఎంఆర్ షీటూ..

విద్యార్థులకు బార్ కోడింగ్ నంబరు కలిగిన ఓఎంఆర్ షీట్‌తో పాటు తొలిసారిగా సీరియల్ నంబరుతో ప్రశ్నపత్రాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లి, రోల్ నంబరు ఆధారంగా కేటాయించిన గదిలో వరుస క్రమంలో కూర్చున్న విద్యార్థులకు అదే క్రమంలో ఓఎంఆర్ షీట్‌తో పాటు ప్రశ్నపత్రం పంపిణీ చేస్తామని చెప్పారు. ఇన్విజిలేటర్ ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌లో తమ వివరాలు సరిగ్గా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకున్న తరువాతే విద్యార్థులు దానిపై సంతకం చేయాలని, ఒకవేళ వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లి సరైన ఓఎంఆర్ షీట్ పొందాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

99513 97109, 92475 77313

- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌తో వచ్చేందుకు ఎవ్వరికీ అనుమతి లేదని, విద్యార్థులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు సహా తనిఖీ బృందాల వద్ద సెల్‌ఫోన్ ఉండేందుకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాలను సందర్శించే అధికారులు సెల్‌ఫోన్లను బయటే ఉంచి వస్తారని తెలిపారు. పరీక్షల గురించి తప్పుడు ప్రచారాలు సాగించేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుందని ఆమె స్పష్టం చేశారు. పరీక్షలకు సంబంధించి సమాచారం, ఫిర్యాదుల కోసం డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో గుంటూరు డీవైఈఓ కె. సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.వెంకట్‌రెడ్డి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు పరీక్షల విధుల్లో చేరాలి

టెన్త్ పరీక్షల విధులకు కేటాయించిన ఉపాధ్యాయులను విధుల నుంచి రిలీవ్ చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను డీఈవో శైలజ ఆదేశించారు. విధులకు కేటాయించిన ఉపాధ్యాయులకు రిలీవ్ చేయని హెచ్ఎంలతో పాటు విధులకు గైర్హాజరైన పక్షంలో సంబంధిత ఉపాధ్యాయుల పైనా విద్యాశాఖ నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చామని, పరీక్షలు జరిగే రోజుల్లో పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల మధ్య వాటిని పరీక్షా కేంద్రాలకు చేర్చుతామని చెప్పారు.

రైతు సాధికారత దిశగా కృషి

- రైతును రాజును చేసేందుకే..
- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- లాంఫాం పరిశోధన స్థానం శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి చిత్రంలో వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు రూరల్: రైతు సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మండలిలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శతాబ్ది వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కృషీవలుని విగ్రహం, నూతన భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు గ్రామంలోనే అన్నిరకాల సేవలు, విత్తనాలు, ఎరువులు, క్రయవిక్రయాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి వంద సంవత్సరాలుగా కృషి చేసిన శాస్త్రవేత్తలు, అధికారులను అభినందించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నపాటి పరిశోధన స్థానంగా శతాబ్ది కాలంలో వందల రకాల నూతన వంగడాలను అందించిన ఘనత లాంఫాంకు ఉందని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ, సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను వివరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని వ్యవసాయ రంగాన్ని మరింత మెరుగు దిశగా అభివృద్ధి చేయాలన్నారు. వందేళ్ల కాలంలో లాంఫాం సాధించిన ఘనతను ఏడీఆర్ డాక్టర్ సుబ్బారావు వివరించారు. మాజీ వైస్ చాన్స్‌లర్, ఏపీ స్టేట్ అగ్రిమిషన్ పర్మినెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విస్తృత పరిశోధనలు చేసి రైతుల మేలుకు పాటుపడిన శాస్త్రవేత్తలను అభినందించారు. రైతులు స్వయంగా ఎద్దుల బడ్లను తెచ్చి అలంకరణలు ఆకట్టుకున్నాయి. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయాభినందన, మాజీ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, డాక్టర్ ఎన్వీ నాయుడు, మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.జగన్నాథం, మాజీ డీన్ డాక్టర్ ఎలమందారెడ్డి మాట్లాడారు.. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిపాలన అధికారులు డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ చిరంజీవి, డాక్టర్ ఎ.మణి, డాక్టర్ పీ సాంబశివరావు, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ పీ సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మణిపాల్‌లో ఈవినింగ్ క్లినిక్ ప్రారంభం

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అవుట్ పేషెంట్ సేవలను ప్రారంభించనున్నట్లు మణిపాల్ డైరెక్టర్ కంటిపూడి సుధాకర్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పల్మనాలజీ, ఈఎన్‌టీ, పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, కార్డియాలజి, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆంకాలజీ వంటి వివిధ ప్రత్యేక విభాగాలు ఓపీడీ సేవలను అందించనున్నామని, అపాయింట్ మెంట్ కోసం 08645669966, 18001025555 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కార్యకర్తలపై కేసులు ఎత్తివేయాలి

నెహ్రూనగర్: కొద్ది సంవత్సరాలుగా నుంచి వివిధ సమస్యలపై శాంతియుతంగా ధర్నాలు, దీక్షలు చేస్తున్న మాదిగ కార్యకర్తలు, నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులను ధ్వంసం చేసిన అగ్రకుల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసిన విధంగానే మాదిగలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు.

వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వద్దు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

మేడికొండూరు: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రూ.25లక్షలతో అభివృద్ధి చేసిన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. లోపల గోడలపై అక్కడక్కడ బూజు ఉండటంతో కనీసం గోడలు శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. మేడికొండూరు వెలవర్తిపాడు రోడ్డులోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కాలనీ వాళ్ళు అక్కడకు చేరుకుని అంగన్‌వాడీ కేంద్రంలో కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో మద్యం తాగి, పేకాట ఆడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ శ్రావణ్‌బాబు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, తహసీల్దార్ కె.కరుణకుమార్, ఈఓపీఆర్డీ పి.రవికుమార్, మండల వైద్యాధికారి అనిరుథ్ ఉన్నారు.

సాయం చేసే చేతులే మిన్న

- ఎడ్యుకేషనల్ హబ్‌గా అంకిరెడ్డిపాలెం
- విద్యాకాంతులతో పేదరికపు చీకట్లు తొలగిస్తున్న సీఎం జగన్
- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
- అంకిరెడ్డిపాలెం స్కూలుకు 100 బెంచీలు అందజేసిన క్రెడాయ్



రిబ్బన్ కట్‌చేసి బెంచీలను అందజేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి. పక్కన క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు

గుంటూరు రూరల్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మాటలు అక్షర సత్యాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. తాను అడగ్గానే స్పందించి అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు 100 బెంచీలను వితరణగా అందజేయడం ద్వారా క్రెడాయ్ సంస్థ దీన్ని మరోమారు చక్కగా నిరూపించిందని ఆయన కితాబిచ్చారు.

ఒక మంచి కార్యక్రమానికి ముందుకొచ్చిన క్రెడాయ్ సంస్థ ప్రతినిధులకు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు 100 బెంచీలను ఉచితంగా అందజేశారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చొరవతో క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి, గుంటూరు చైర్మన్ ఆరుమళ్ళ సతీష్, గుంటూరు ప్రెసిడెంట్ మామిడి రాము పూనుకోవడంతో పాఠశాలకు కొత్త బెంచీలు చేకూరాయి. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు సీజే మణికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, తాను పుట్టి పెరిగి ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న అంకిరెడ్డిపాలెంను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని తాను తనతో పాటు గ్రామ పెద్దలు సంకల్పించినట్లు చెప్పారు.

పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ దాతల ఆశయాలు, ఆదర్శాలకు అనుగుణంగా పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. డిప్యూటీ డీఈఓ కె.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఫలితంగానే అంకిరెడ్డిపాలెం పాఠశాలకు అన్ని వసతులు అమరుతున్నట్లు చెప్పారు. క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో మన రాష్ట్రం దేశంలోనే ముందు వరసలో ఉన్నట్లు చెప్పారు.

క్రెడాయ్ గుంటూరు అధ్యక్షుడు మామిడి రాము మాట్లాడుతూ అంకిరెడ్డిపాలెం పాఠశాల, జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్రెడాయ్ గుంటూరు వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, గుంటూరు కార్యదర్శి టి.వినోద్‌రెడ్డి, ఆక్టివిటీ కన్వీనర్ జి.పూర్ణచంద్రరావు, స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకట రమణదేవి బ్రహ్మారెడ్డి, గ్రామ పెద్దలు కుర్ర సాంబిరెడ్డి, లేళ్ళ పెద్దఅప్పిరెడ్డి, పులి సాంబిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, శ్యామల కిషోర్ రెడ్డి, చింతగుంట్ల రంగారెడ్డి, దేశిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, శ్యామల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతిదేవి సేవలు ఎనలేనివి



డాక్టర్ పద్మావతి దేవి దంపతులను సన్మానిస్తున్న వైద్య కళాశాల ఉద్యోగులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా కళాశాల అభివృద్ధికి డాక్టర్ చాగంటి పద్మావతిదేవి ఎంతో కృషి చేశారని, ఆమె సేవలు వెలకట్టలేనివని పలువురు వైద్యులు పేర్కొన్నారు. శుక్రవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో డాక్టర్ పద్మావతిదేవి పదవీవిరమణ సందర్భంగా పలువురు వైద్యులు, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, వైద్య విద్యార్థులు డాక్టర్ పద్మావతిదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. పీజీ సీట్లు మంజూరు అవడంలో, కళాశాలలో పలు నిర్మాణాల పనుల్లో డాక్టర్ పద్మావతిదేవి చాలా కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ చంద్రకళ, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ద్రోణంరాజు ఫణిభూషణ్, పలువురు వైద్య విభాగాధిపతులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. తనకు ప్రిన్సిపాల్‌గా పనిచేసేందుకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి డాక్టర్ పద్మావతి దేవి కృతజ్ఞతలు తెలిపారు. తనకు విధుల్లో సహకరించిన వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన భర్త డాక్టర్ వై.వి.ఎస్.ప్రభాకర్, తన కుటుంబ సభ్యులు తనకు ఎంతో సహకారం అందించడం వల్ల ప్రిన్సిపాల్ పదవిలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కొనసాగినట్లు వెల్లడించారు.

నాటి వైద్య విద్యార్థే... నేటి ప్రిన్సిపాల్



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నీలి ఉమాజ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆమె వైద్య కళాశాలలో మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ పద్మావతి దేవి పదవీ విరమణ చేశారు. ఈనేపథ్యంలో డాక్టర్ ఉమాజ్యోతిని ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

ఇద్దరు చోరశిఖామణుల అరెస్టు

–ఆటో, నాలుగు ద్విచక్రవాహనాలు, 8 మోటార్లు స్వాధీనం



ద్విచక్రవాహనాలు, విద్యుత్ మోటార్లును చోరీ చేసిన నిందితులతో డీఎస్పీ,సీఐ,ఎస్ఐ

నగరం: ద్విచక్రవాహనాలు, ఆటోలు, విద్యుత్ మోటార్లు దొంగతనం చేస్తున్న ఇరువురు వ్యక్తులను శుక్రవారం నగరం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ దొంగతనాలకు పాల్పడిన నిందితుల వివరాలను వెల్లడించారు. నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, అడవులదీవి మండలాలలోని పంటపొలాల్లో విద్యుత్ మోటార్లు, ఇళ్లు, రహదారుల వెంట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను చోరీ చేస్తున్న నిందితులను గుర్తించినట్లు తెలిపారు. చెరుకుపల్లి మండలం కావూరు వెంకటరెడ్డి పాలెం గ్రామానికి చెందిన పగడం పవన్ కల్యాణ్ రెడ్డి, కావూరి అజయ్‌రెడ్డిలు చెడు వ్యసనాలకు అలవాటై ఖర్చులకు డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. నిందితులు నగరం మండలంలోని సిరిపూడి, చినమట్లపూడి, తాడివాకవారి పాలెం పంటపొలాలల్లో, చెరుకుపల్లి, అడవులదీవి, నిజాంపట్నం గ్రామాలలో రాత్రి సమయాలలో రహదారులు, ఇంటి వద్ద నున్న ద్విచక్ర వాహనాలు, పంటపొలాల్లో విద్యుత్ మోటార్లు దొంగతనాలు చేసినట్లు వివరించారు. కావూరు వెంకటరెడ్డి పాలెంలోని పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద ఉన్న ఒక ఆటో, నాలుగు ద్విచక్ర వాహనాలు, 8 విద్యుత్ మోటార్లు సుమారు 5.50 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిందితులపై నగరంలో 6, చెరుకుపల్లి, నిజాంపట్నం, అడవులదీవి పోలీస్‌స్టేషన్‌లలో రెండు కేసుల చొప్పున మొత్తం 12 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి రేపల్లె కోర్టులో హాజరుపరిచామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి కేసులోని నిందితులను పట్టుకున్న నగరం ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని డీఎస్పీ మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఐఎఫ్ఎస్ అధికారులు



జేసీతో మాట్లాడుతున్న ఐఎఫ్ఎస్ అధికారులు

గుంటూరు వెస్ట్: 2022 సంవత్సరానికి ఎంపికైన ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారిన్ సర్వీస్) అధికారులు పూసపాటి సాహిత్య, ఎస్‌వీ అశోక్‌లు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ జి.రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని పరిపాలన, వివిధ ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఏపీహెచ్ఆర్‌డీఐ మంగళగిరిలో ఐదు రోజుల ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా అధికారులిద్దరూ జేసీని కలిశారు. డీఆర్వో చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగులకు స్పందన కార్యక్రమం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉదయం 10–30 నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని డీఆర్వో చంద్రశేఖర రావు తెలిపారు. ప్రతినెలా మొదటి శనివారం నిర్వహించే ఈ కార్యక్రమం ఉద్యోగులకు మాత్రమేనన్నారు. పూర్తి వివరాలతో ఉద్యోగులు తమ అర్జీలను తీసుకురావాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న మినీవ్యాను

11 మందికి గాయాలు, ఒకరి మృతి



ప్రమాద సంఘటనలో ఢీకొన్న మినీ వ్యాను, ఆర్టీసీ బస్సు

మేడికొండూరు: రోడ్డుపై వస్తున్న ఆర్టీసీ బస్సును, ఎదురుగా వస్తున్న మినీ వ్యాను బలంగా ఢీకొన్న సంఘటనలో 11 మందికి గాయాలు కాగా ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల నరసరావుపేట బ్రిడ్జిపైన శుక్రవారం జరిగింది. గుంటూరు నుంచి ప్రయాణికులతో నరసరావుపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సును, నరసరావుపేట నుంచి రేపల్లె వెళ్తున్న మినీవ్యాను ముందు వెళుతున్న కారును అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో మినీవ్యానులో ప్రయాణిస్తున్న రేపల్లెకు చెందిన డ్రైవర్ హరిదాసు సాయికృష్ణ (22), అతని భార్య రేఖలకు తీవ్రగాయాలయ్యాయి. వేగంగా బస్సుమీదకు మినీవ్యాను దూసుకురావడం.. డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో బస్సులో పదిమంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాద సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ మార్గాన ప్రయాణిస్తున్న గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పరిస్థితి గమనించి కారుదిగి వచ్చి రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను క్రేన్ ద్వారా తొలగించేందుకు అధికారులతో మాట్లాడారు.

కేఎల్‌యూ ప్రవేశ ఫలితాల విడుదల

విడుదల చేసిన ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం విడుదల చేశారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో అమర్‌నాథ్ పాల్గొని బటన్ నొక్కి ఫలితాలు విడుదల చేసి, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలపై యువత దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చదువు పూర్తి చేసుకుని విద్యార్థి బయటకు వచ్చిన వెంటనే ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో ఐ స్పేస్ పేరిట ఐకానిక్ బిల్డింగ్ ఏర్పాటు కానుందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని, పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని, మన విద్యార్థులకు ఇక్కడే మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు వచ్చేలా పటిష్ట కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు www. kluniversity. in వెబ్‌సైట్‌లో లభిస్తాయని తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్స్ బీఎస్ఎన్ మూర్తి, హెచ్ఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఇన్విజిలేటర్ల నియామకంలో గుంటూరు నగ, రూరల్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు కోరారు.

ఈమేరకు శుక్రవారం డీఈవో కార్యాలయంలో డీఈవో పి.శైలజను కలిసి వినతి పత్రం సమర్పించారు. టెన్త్ పరీక్షల విధులకు ఎస్జీటీలతో పాటు భాషా పండిట్లు, పీడీలను నియమించారని, అయితే వీరిలో అనేక మంది వివిధ కారణాలతో అధికారులను మినహాయింపు కోరగా, ఎటువంటి విచారణ లేకుండా మినహాయింపులు ఇచ్చా రని తెలిపారు. అదే విధంగా నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్, సబ్జెక్టు ఉపాధ్యాయులను అసంబద్ధంగా నియమించారని, ఈ విషయంలో గుంటూరు రూరల్ ఎంఈవో అత్యుత్సాహంతో చేతివాటం ప్రదర్శించారని డీఈవో దృష్టికి తెచ్చారు. గతంలో సైతం సదరు ఎంఈవోపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శించకండి

డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. శుక్రవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రల వైద్యధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో వ్యాక్సిన్లు వేయించుకుని వ్యాధుల బారిన పడకుండా ముఖ్యంగా తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, ఇతర దోమకాటు వ్యాధుల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. జ్వరాల బారిన పడిన వారికి తక్షణమే వైద్య సహాయం అందించాలని, అన్ని ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన

దీర్ఘకాలిక వ్యాధులైన అధిక రక్తపోటు, మధుమేహంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధి బాధితులకు ఉచితంగా మందులు, చికిత్స అందించాలన్నారు. మాతృమరణాల నివారణే లక్ష్యంగా గర్భం దాల్చినది మొదలుకొని కాన్పు వరకు ప్రణాళికా బద్ధంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేయాలని చెప్పారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీని గుర్తించి ప్రసవ ప్రణాళిక రూపొందించి ఆసుపత్రిలో సుఖప్రసవం జరిగేలా చూడాలన్నారు. ప్రసవం కోసం వారు 108, 104 వాహనాలు వినియోగించుకునేలా చూడాలని చెప్పారు. కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్నవారికి ప్రత్యేకంగా చికిత్స అందించాలన్నారు. క్షేత్రస్థాయి సూపర్‌వైజర్ సిబ్బంది, వారి పరిధిలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాలు లక్ష్యాలకనుగుణంగా చేరుకోవాలన్నారు. పిల్లల్లో తొందరగా లోపాలు గుర్తించి వారిని గుంటూరు జీజీహెచ్‌లోని డైక్ కేంద్రానికి పంపించి సకాలంలో ఉచిత వైద్య సేవలు, ఆపరేషన్లు అందేలా చూడాలన్నారు. ఏప్రిల్ 6 నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమవుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వైద్యులు, వైద్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతమయ్యేలా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. సమీక్షలో ఎన్‌హెచ్‌ఎం డీపీఎం డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డీఏఓ డాక్టర్‌సుబ్బరాజు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా–సామాజిక ఔచిత్యంపై వర్క్‌షాప్

- మూడు రోజులపాటు వర్క్‌షాప్
- ప్రసంగించనున్న సినిమా, జర్నలిజం, విద్యా రంగ నిపుణులు
- వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ జె మధుబాబు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'సినిమా అండ్ సోషల్ రిలవెన్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ప్రారంభమవుతుంది. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో సినిమా, జర్నలిజం, విద్యా రంగాలకు చెందిన 12 మంది నిపుణులు పలు అంశాలపై ప్రసంగిస్తారని సదస్సు డైరెక్టర్, జర్నలిజం విభాగ అధ్యాపకుడు డాక్టర్ జె.మధుబాబు తెలిపారు. మూడు రోజులపాటు ఆయా రంగాల ప్రముఖుల ప్రసంగాలతోపాటు ఉదయం, సాయంత్రం చలనచిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. భారతీయ చలనచిత్ర ప్రముఖుడు సత్యజిత్ రే అస్కార్ అవార్డు సాధించిన చిత్రం 'పతేర్ పాంచాలి' తొలి రోజు ఉదయం 9 గంటలకు డైక్‌మెన్ ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ప్రారంభోత్సవ సభకు ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా, బెంగుళూర్‌కు చెందిన సినీ రచయిత, దర్శకుడు, నిర్మాత, పద్మశ్రీ అవార్డు గ్రహీత గిరీష్ కాసరవల్లి కేరళ చలనచిత్ర అకాడమీ మాజీ చైర్మెన్, 35 జాతీయ సినీ అవార్డుల గ్రహీత షాజీ ఎన్ కరుణ్ కీలకోపన్యాసకులుగా, తెలుగు సినీ దర్శకుడు, రచయిత సి.ఉమామహేశ్వరరావు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, న్యూఢిల్లీ జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ కృష్ణ శంకర్ కుసుమ ప్రత్యేక అతిథులుగా, రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత పాల్గొంటారని తెలిపారు.

మూడు రోజులలో 12 ప్రసంగాలు..

వర్క్‌షాప్‌లో భాగంగా మూడు రోజుల్లో 12 మంది పలు అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించనున్నారని సదస్సు డైరెక్టర్ తెలిపారు. తొలిరోజు న్యూఢిల్లీ జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ కృష్ణ శంకర్ కుసుమ 'ద ఇంటర్‌సెక్షనల్ ఐడెంటిటీస్ ఆఫ్ దళిత్ ఉమెన్ ఇన్ తెలుగు మూవీస్' అనే అంశంపైన, సీనియర్ ఎడిటర్, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి 'హ్యూమన్ రైట్స్ అండ్ ఇండియన్ సినిమా' అనే అంశంపైన బెంగుళూరుకు చెందిన సినీ దర్శకుడు గిరీష్ కాసరవెల్లి 'ఆయన తీసిన సినిమాలు, వాటి అనుభవాలపైన', సినీ దర్శకుడు, రచయిత సి ఉమామహేశ్వరరావు 'ఎక్స్‌ప్రెషనిజం అండ్ రియలిజం ఇన్ ఫిలిమ్స్' అనే అంశంపైన రెండో రోజు హైదరాబాద్ శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య సుధీర్ కుమార్ కడియాల 'సాంగ్స్ ఆఫ్ యోరే పోర్‌ట్రాయింగ్ దళిత్ ఎమోషన్స్' అనే అంశంపైన, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ వెల్లిక్కీల్ రాఘవన్ 'మూవ్‌మెంట్స్ ఇన్ వరల్డ్ సినిమా: హిస్టారికల్ పర్‌స్పెక్టివ్' అనే అంశంపైన, చెన్నైకి చెందిన సినిమాటోగ్రాఫర్ ఆర్‌వీ రమణి 'పొలిటిక్స్ ఆఫ్ ఇమేజ్ అండ్ సౌండ్' అనే అంశంపైన, సినీ దర్శకుడు ఎంవీ రఘు 'మై జర్నీ విత్ లైట్ అండ్ లెన్స్' అనే అంశంపైన, మూడో రోజు కేరళకు చెందిన సినీ దర్శకుడు షాజి ఎన్ కరుణ్ 'మెటాఫార్ ఇమేజ్ అండ్ సినిమా' అనే అంశంపైన ప్రసంగిస్తారని తెలిపారు. చివరి రోజు సాయంత్రం ఆడియో విజువల్ స్కిట్ ఉంటుంది.